# గొప్పవాడివి కావాలంటే !! ( మినీ కథ )

సత్తిరాజుకి మంచి సెంటర్లో మూడంతస్థుల భవనం వుంది. నెల తిరిగేసరికి మూడువేలదాకా అద్దెల రూపంలో కళ్ళ చూస్తాడు. అంచేత అతడికా చట్టు పక్కల మంచి పరువుంది. పరువుల్లో రెండు రకాలున్నాయి. ఒకటి మీరు కన్పించి నపుడు అతి మార్యాదగా , ఆప్యాయంగా మాట్లాడి తీరా మీరటువెళ్ళగానే ఛీ ..ఛీ వెధవంటారు. ఇక రెండో రకం. మీ వెనక కూడా మిమ్మల్ని మెచ్చుకుంటారు.

సత్తిరాజుది మొదటి రకం పరువు. అతడి ముందు పొగడ్డానిక్కారణం అతని మేడ, డబ్బు అయితే , అతడి వెనకాల ఛీ ఛీ అనడానిక్కారణం అతడి పిసినారితనం . సింగరాజు లింగరాజుకి ఇతగాడి ఏదయినా రిలేషన్ వుందేమో తెలీదుగాని, వీరిద్దరూ సమకాలీకులై వుంటే మాత్రం ఇతడి వద్దనుండి ఆ లింగరాజు చాలా చిట్కాలు నేర్చుకునుండేవాడు. ఆ చుట్టుపక్కల కూరలమ్మే వాళ్ళని, దుకాణం దార్లని , అతడింట్లో " పన్చేసే పనిమనిషిని, చివరకి ఆ మేడకట్టిన కూలీలని. మేస్త్రీని ఎవర్ని కదిపినా అతడి ప్రతాపం కథలు కథలుగా చెబుతారు.

ఇంతకీ చెప్పొచ్చేదేమంటే అటువంటి మహానీయుడికొంపలో నీళ్ళతొట్టి వున్నట్టుండి ఒక రోజు పాపం బ్రద్దలైనట్లు విచ్చుకుంది. ఆ కారణంగా అలా చెప్పా పెట్టకుండా అదలా బ్రద్దలవటంతో సత్తిరాజుకి నీళ్ళకిబ్బంది కల్గింది. అందులో అతడుండేది మూడో అంతస్థులోనేమో ఇబ్బంది దారుణంగా తయారయ్యి, మరొక తొట్టికొనడం అనివార్యం అయింది. అప్పటికి వారంరోజులు లాగించేడు. కాని భార్య ధనలక్ష్మి పోరు భరించలేక కొనక తప్పేటట్లు కన్పించలేదు. ఆరోజు నుంచి పై అంతస్థు బాల్కనీలో కూర్చుని చూపుల గేలంతో ఎదురు చూడసాగేడు.

ఆరోజు వాడి పాపంపండి. పాపారావు నాలుగయిదు సిమెంటు తొట్టెలు రిక్షాలో పెట్టుకుని , కాస్త పెద్దగా అరుచుకుంటూ ఆ వీధిలో కొచ్చేడు . సత్తిరాజు అతడ్ని నిల్చోమని చెప్పి మేడ దిగి భూమ్మీద కొచ్చేడు.

రిక్షాలో వున్న సిమెంటు తొట్టెలను నఖశిఖ పర్యంతం పరీక్ష చేసి ' ఎంత రాబ్బీ ' అనడిగాడు. ' పాతికండీ ' అన్నాడు పాపారావు బోణీ బేరం గదాన్చెప్పి.

‘ ఏమిటి  ఒక్కొక్కటా, అన్నీ  కలిపా ! అన్నాడు దాంట్లో రిక్షాని కూడా  కలపనందుకు నొచ్చుకుంటూ.‘ భలేవారండీ,  ఒక్కోటి  బాబూ ’ అన్నాడు.  పాపారావు  భయంగాను, విచిత్రంగాను చూస్తూ . సత్తిరాజు  చివుక్కున  ఫీలింగు  మార్చి ‘ వొద్దులే  వెళ్ళిరా ’ అంటూ వెనక్కి తిరిగేడు.

‘ ఎతక్కావాలో  అడగండి ’ అన్నాడు పాపారవు  పక్కనే వున్న రిక్షావాడు.  అంతలో పై నించి ధనలక్ష్మి  ‘ మొన్ననే  కిందవాటా వాళ్ళు కొన్నారు,  పెద్దనిమిది ’ అంది సత్తిరాజుకి  వత్తాసుగా, ‘ ప్చ్ ’  ఆ రేటుకి  రాదండి ’  అన్నాడు పాపారావు కదిలివెళ్ళబోతు  ‘ సర్లే దాని మాటలకేం గాని  ఇంకో రూపాయి చేసుకో ’ అన్నాడు. డబ్బంటే  నిర్లక్ష్యం  చేసేవాడిలా  ‘ చివరిమాట ఇరవైకి తగ్గదండి ’  అన్నాడు పాపారావు  ‘ ఏడ్చావ్ వెధవ  వేదుక బేరాలు  మీరున్నూ  పందొమ్మిదిన్నర  అంతే కాదంటే  వెళ్ళిపో ’

పాపారావు ఆలోచించాడు.ఆ రోజుతొలిబేరం . అర్ధరూపాయి  కోసం  చూస్తే రోజు రోజంతా  అలాగే వుంటుంది. ‘ సరే కానివ్వండి ’ అన్నాడు.

సత్తిరాజు  కదలిపైకెళ్ళబోతూ  ‘ సరే  దాన్ని పైకి  పట్టుకురండి డబ్బులిస్తా ’ అన్నాడు.

పాపారావు  నోరు తెరిచాడు  ‘ ఏమిటి పై క్కూడా  చేర్చాలా ? ’ అన్నాడు భయంగా.

‘ లేకపోతే రోడ్డుమీద  పెట్టి వెడతావా ? పద్దెనిమిదికి నిక్షేపంలా  పైకి చేర్చాడు మొన్న ’

రిక్షావాడు. పాపారావు  మొహాలు చూసుకొని పట్టరా నీయవ్వ  పోద్దుగాల్న  ఎవడి మొహం  చూశామో  అనుకుంటూ  ఆ తొట్టిని  పైకి చేర్చి  డబ్బులు  పుచ్చుకుని వెళ్ళిపోయారు.

ధనలక్ష్మి భర్తని దుయ్యబట్టింది రూపాయిన్నర తగలేసి నందుకు.  సత్తిరాజు  చిత్రంగా నవ్వి క్రితం సారి కొన్నప్పటి  ఎకౌంటు చూపించాడు.  తట్టి  నిలువ పద్దెనిమిది  – దాన్ని పైకి  చేర్చినందుకు  అయిదు  వెరసి  ఇరైమూడు.

ఇప్పుడు లాభం మూడున్నర !

ఆ విషయాన్ని సత్తిరాజు  ఎకౌంట్లో రాసుకుంటున్నాడు.  అంచేత  ధనలక్ష్మి  అతడి వైపు  మెచ్చుకోలుగా  చూడటం  అతడికి తెలీదు.

**-------- అయ్యిపోయింది --------**